12

# తోడు

పక్కన ఎవరో నుంచున్నట్లనిపించింది, తల పక్కకి తిప్పింది లాస్య. రోహిత్, కళ్ళజోడు లోంచి చూస్తున్నాడు ఆమెను.

"నీతో కొంచెం మాట్లాడాలి, కొంచెం పర్సనల్..." అన్నాడు.

ఓ రకమైన జీర, డీప్‌గా ఉన్న ఆ మాటలు విన్నాక, లాస్య గుండె లయ తప్పినట్లనిపించింది. అందులోని మార్దవం, లాలిత్యం, గమనించి కుర్చీని రోహిత్ వైపుగా తిప్పుకుంది.

"చెప్పు..." సాధారణ విషయం ఏదో క్యాజుయల్‌గా అన్నట్లుగా అనింది. కానీ అలా అనడానికి కష్టపడింది.

ఓ నిమిషం మౌనంగా ఆమెను చూసి, పెదిమలు పూర్తిగా లోపలికి పెట్టి బిగించి, కళ్ళు చిన్నగా చేస్తూ ఆలోచించాడు.

తల అడ్డంగా ఊపాడు.

"ఉహూ... ఇక్కడ కాదు, సాయంత్రం నన్ను కలువగలవా!"

కుదరదన్నట్లుగా తల అడ్డంగా ఊపింది.

"పోనీ... రేపు సాయంత్రం, మినర్వా కాఫీ షాప్... ఆరుగంటలకు..."

"ఇక్కడ మాట్లాడకూడదా!... రేపు సాయంత్రం అక్కడ ఎక్కడో చెప్పాలా?" నవ్వాడు. "అవును లాస్యా! అక్కడ, ఎక్కడో చెప్పాలి.. రేపు కలుద్దాం..." అంటూ వెళ్ళిపోయాడు రోహిత్.

ఇంటికెళ్ళాక, తండ్రితో చెప్పింది. తల్లి, అక్క, నానమ్మ అందరూ ఇచ్చిన సలహా ఒక్కటే! "నిజం చెప్పెయ్యి, ఇప్పుడు చెప్పక పోతే, రేపయినా బయటపడుతుంది. అప్పుడు నీ మొహం ఎక్కడ దాస్తావు?"

మంచంమీద వాలిందే కానీ, మర్చిపోయానని అనుకున్న గతం కళ్ళ ముందు, భయంకరంగా నుంచుంది.

జీవితం అంటే కలలు, తియ్యటి ఊహలు, హాయిగా పాడుకునే పాట అనుకుంటూనే ఇంజనీరింగ్ పూర్తి చేసింది. వెంటనే ఢిల్లీలో ఆఫర్ వచ్చింది. ఎవరెస్ట్ పర్వతాన్ని ఎడంకాలితో తన్నేసినట్లుగా, ఉన్న ఊరిని వదిలి ఢిల్లీ వెళ్ళింది. కానీ ఎంతో కాలం కాకుండానే, జీవచ్ఛవంలాగా అయిపోయింది.

జీవితాన్ని ఎవరో బహిష్కరించి, సైబీరియాలోకి విసిరేసినట్లుగా అనిపించింది. జవాబు దొరకని ప్రశ్నలా తయారయింది జీవితం. ఇంక ఆలోచించలేకపోయింది.

కలత నిద్రలో గడిపింది రాత్రంతా, ఏం జరుగుతుంది. పర్యవసానం ఎలా ఉంటుంది?

మర్నాడు, శనివారం, సాయంత్రం ఆరుగంటలకి మినర్వా కాఫీ షాపులో రోహిత్, లాస్య, ఓ మూల కూచుని నిశ్శబ్దంగా కాఫీ తాగుతున్నారు.

కాఫీ తాగడం అయిపోయాక, గొంతుని ఓసారి సవరించుకుని, ఎక్కువ ఉపోద్ఘాతం లేకుండా చెప్పాడు.

"దాదాపు ఏడాదిగా, మనిద్దరం స్నేహితులుగా ఉన్నాం. ఈ ఏడాదిలో, నిన్ను చాలా కోణాల్లోంచి, చాలా దగ్గరగా చూశాక నిన్ను పెళ్ళి చేసుకోవాలనిపించింది. ఆఫీసులో చెప్దామంటే, నీ రియాక్షన్ ఎలా ఉంటుందో నన్న భయానికి జంకాను. నీకిష్టం అయితేనే పెళ్ళి జరుగుతుంది... లేకపోయినా మనం మునుపటి స్నేహాన్ని కొనసాగిద్దాం... తొందరేమీ లేదు... ఆలోచించుకోవడానికి నీ క్కావలసినంత టైము తీసుకో... నిర్ణయం వెంటనే చెప్పాలని నేనడగను."

ఇది ఊహించినదే. అయినా నిజంగా అడిగితే మౌనం వహించింది. అయిపోయింది. ఆ క్షణం వచ్చేసింది. ధైర్యం తెచ్చుకోవాలి. యుద్ధం చేస్తున్న సైనికుడిలాంటి ధైర్యం కావాలి.

"పెళ్ళి అనేది స్త్రీ పురుషుల మధ్య జరిగే ఓ ధర్మకార్యం. అది జీవితాంతం నిలవాలంటే, మోసాలు, దాపరికాలు ఉండకూడదు. లేకపోతే పునాదులు కదిలిపోతాయి..." తలొంచుకుని అంది.

అర్థం కానట్లుగా మొహం పెట్టాడు.

"ఈ హైదరాబాద్ రాకముందు, గుర్‌గావ్‌లో పనిచేసేదాన్ని. చీకటి తెరలు నగరాన్ని చుట్టేస్తున్న సమయాన, నేను ఓ టాక్సీలో రేప్ చేయబడ్డాను. ఆ టాక్సీవాడిని పట్టుకున్నారు. వాడికి శిక్ష పడింది. కానీ, నేనే మామూలవలేకపోయాను. తర్వాత హైదరాబాద్ వచ్చాం" ఆగింది.

నోరు తెరచి, ఆశ్చర్యంగా ఆమెను చూస్తున్నాడు రోహిత్.

ఎంత కంట్రోల్ చేసుకున్నా గొంతులో వణుకు, రోహిత్ మొహం చూడడానికి ధైర్యం చాలక, తల బాగా దించుకుంది.

'లాస్యలోని నెమ్మదితనానికి, తక్కువ మాట్లాడ్డానికి కారణం ఇదా!' అనుకుంటూ ఆమెనే చూస్తున్నాడు.

"నీకు ఇంకో విషయం కూడా చెప్పాలి. నేను గుర్‌గావ్‌లో ఉండగానే, నొయిడా హెచ్‌సిఎల్‌లో పనిచేసే ప్రశాంత్ అనే అబ్బాయితో, పెద్దవాళ్ళు నా పెళ్ళిని కుదిర్చారు. కానీ... ఇది జరిగాక, తను మా ఎంగేజ్‌మెంట్‌ని బ్రేక్ చేసి, మేం పెట్టిన ఉంగరం, బట్టలు, గొలుసులు పంపించేశాడు. కారణం... ఎవరైనా ఊహించవచ్చు...?"

రోహిత్‌లోని శక్తినంతా ఎవరో లాగేసినట్లనిపించింది.

"పెళ్ళికి పవిత్రతే ముఖ్యమనుకునే సమాజంలో ఉన్నాం. జరిగినది, నా ఇష్టప్రకారం జరగలేదు. నేనే దాన్ని దాచవచ్చు. కానీ నీకు చెప్పాల్సిన బాధ్యత నాది. ఇప్పుడు నేను చెప్పకపోతే, నన్ను నేను ఎప్పటికీ క్షమించుకోలేను.

"ఇప్పుడు నిర్ణయం నువ్వు తీసుకోవాలి. చిన్న విషయం కాదు, నువ్వు మామూలు రోహిత్ అవడానికి సమయం పడుతుంది."

ఇద్దరూ ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. ఇంటికెళ్ళాక, జరిగింది అందరికీ చెప్పింది లాస్య.

"నువ్వు చెప్పాల్సింది చెప్పావు. ఇంక ఆ అబ్బాయిష్టం..."

అలజడిగా వున్న మనసుని అదుపులోకి పెట్టుకోవడానికి, రెండు వీధుల అవతల ఉన్న వృద్ధాశ్రమానికి వెళ్ళింది. శని, ఆదివారాలు వెళ్తూ వుంటుంది అక్కడికి. అక్కడ కొంతమందికి పేపరు చదివి పెడ్తుంది. నవలలు, కథలు, పురాణాలు, వీలుని బట్టి చదువుతుంది.

మర్నాడు ఆదివారం.

లాస్య అక్క లాహిరి ఇద్దరు పిల్లల్ని తీసుకుని వచ్చింది.

"రేపు సోమవారం. రోహిత్ ఆఫీసు కొచ్చాక, నీకు నెగిటీవ్‌గా తన నిర్ణయం చెప్తే నువ్వు బాధపడకు. ఈ ధైర్యం చెప్దామనే ఇవాళ ఇక్కడికి వచ్చాను..."

కృతజ్ఞతతో అక్కని చూసింది.

"నీతో పెళ్ళి కుదిరి, నిశ్చయ తాంబూలాల వరకు అడుగులేసిన ప్రశాంతే మొహం చాటేశాడు. అలాంటప్పుడు ఈ రోహిత్ ఎంత! రోహిత్ కూడా ప్రశాంత్ లాంటివాడే కదా! ఏం సరేనా! ఫీలవకూడదు. ఏం ఫర్వాలేదు నీకు తగ్గవాడు ఎక్కడో అక్కడుంటాడు. నిన్ను వెతుక్కుంటూ వస్తాడు."

తేలిగ్గా నవ్వడానికి ప్రయత్నించింది లాస్య.

"ఏమిటో, కాలం మారిందని ఎంతగా అనుకున్నా, ఈ రోజు వరకు స్త్రీ చదువు, గుణాలు, పవిత్రత పెళ్ళి వరకే చూస్తూ వున్నారు. అవన్నీ కూడా కేవలం పురుషుడి అహాన్ని తృప్తి పర్చడానికి మాత్రమేనేమో..." అంది అమ్మ.

"అదే కదా బాధ. ఇది పెళ్ళయ్యాక వర్తించదు... అది స్త్రీ జాతికే అవమానం... కానీ, అమ్మడూ, ఒక్కటి మాత్రం నిజం స్త్రీని అవమానించాక, నష్టపోయేది పురుషులే. తాము అన్యాయం చేసిన స్త్రీ ముందు నిలబడాలంటే... భయపడ్తారు. అదే ప్రశాంత్ విషయంలో జరిగింది. మొహం చూపించలేకనే కదా, బెంగుళూరు వెళ్ళిపోయాడు. వేరే ఉద్యోగం చూసుకొనే అగత్యం ఏర్పడింది. అంతెందుకు? శాస్త్రాలు తెలిసిన రాముడికే తన కర్తవ్యం తెలీదంటావా! నిజానికి అప్పుడు, ఎప్పుడూ స్త్రీలని పాలిస్తున్నది పురుషులే ఈ నీతి శాస్త్రాలు, ధర్మశాస్త్రాలు ఉత్త పేరుకు మాత్రమే..."

లాస్య నానమ్మ తనదైన శైలిలో లాస్యని ధైర్యంగా ముందడుగు వేయడానికి ఉత్సాహపర్చింది.

"అవేవీ కావు కానీ, ముందు నిన్ను నువ్వు గౌరవించుకుంటున్నావనుకో... ఎదుటివాళ్ళు కూడా గౌరవిస్తారు. ఈ రోహిత్ విషయంలో కూడా అంతే. నిన్ను గౌరవించి, నీ చదువు, నీ రూపం, నిన్ను నిన్నుగా కోరుకునే వాళ్ళుంటారు..."

అందరి మాటలు విన్నాక, కొంచెం మామూలైంది లాస్య.

మర్నాడు ఊహించినట్లుగానే రోహిత్ రాలేదు. ఈ-మెయిల్ చూసుకుంది. ఏదైనా మెసేజ్ ఉందేమోనని, కానీ లేదు.

నోటితో చెప్పక పోతేనేం... మనిషి రాకపోతే అదే అర్థం వస్తుంది.

ఈ సంఘ సంస్కర్తలంతా ఎన్నో ఏళ్ల నుంచి, పునర్వివాహాలు, వితంతు వివాహాలు గురించి, నేను సైతం అని ఓ వెర్రిగొంతుకనిచ్చారు.

ప్రశాంత్, రోహిత్ మనస్తత్వాలు ఒకేలాగే ఉన్నాయి. రోహిత్ ఆ మర్నాడు కూడా రాలేదు. ఆ సాయంత్రం అక్క ఫోన్ చేసింది.

"రోహిత్ రాలేదు కదూ! వస్తే నువ్వు ఫోన్ చేస్తావని నాకు తెలుసు. చెయ్యలేదు. కాబట్టి, రాలేదని అనిపించింది. బాధపడుతున్నావా? లేదు కదా! నీ కోసం జీవించే అవకాశం వచ్చిందనుకో... అంతా జోదా అక్బర్ నిషేధం, యాజిటేషన్‌లు, విప్లవాలు, ఉద్యమాలు, బంద్‌లు గురించి ఆలోచిస్తారు. కానీ మనుషులు తమ హృదయాల్లో, కొంచెం సంస్కారం, అభివృద్ధి, విశాలం లాంటి దాన్ని గురించి ఆలోచించరు...

ఇంక ఈ విషయాన్ని వదిలెయ్యి... నేను సులభంగా చెప్పేస్తున్నా కానీ, ఆచరించడం కష్టం... అసలు జీవితం ముందుంది. ఇంకా ఎన్ని ఎదుర్కోవాలో... ఎంత నిబ్బరంగా ఉండాలో...... జాగ్రత్త..... మామూలుగా ఉండడానికి ప్రయత్నించు."

అక్క, నాన్న, అమ్మ, నానమ్మ... నాలుగు స్థంభాల్లాగా నన్ను పట్టుకున్నారు. కాబట్టి సరిపోయింది. లేకపోతే మానసికంగా ఎప్పుడో కూలి పోయేదాన్ని అనుకుంది లాస్య.

సోమవారం రోహిత్ ఫ్రంట్ ఆఫీస్‌లోనే కనిపించాడు.

"హాయ్" అంటూనే అడుగు ముందుకు వేశాడు.

ఏం జరగనట్లుగా ఉండాలని ప్రయత్నం చేస్తూనే "హాయ్" అంటూ తలుపు తీసుకొని తన క్యూబికల్ వైపు వెళ్ళింది.

"నీతో మాట్లాడాలి..." కాఫీ తాగడానికి రా. అక్కడ నేనుంటాను.. కానీ, ఒక్కటి చెప్తున్నాను. మా ఇంట్లో నేను కాక ఇంకా నలుగురున్నారు. ఆ నలుగుర్ని కన్విన్స్ చేయడానికే ఇన్ని రోజులు పట్టింది... అయినా పదిన్నర వరకూ ఆగలేను.. ఇప్పుడే రావడానికి వీలవుతుందా?"

"ఇప్పుడే వచ్చి సీట్లో కూర్చున్నాను. బావుండదు, కాఫీ కోసం వెళ్ళానని తెలిస్తే... బావుండదు. చెప్పదల్చుకున్నది ఇక్కడే చెప్పు..." నిర్వికారంగా తల వొంచుకుని అంది.

"లాస్య నువ్వు, నేను ఐ.టి. కంపెనీల్లో ఉన్నాం. మనం సమస్యలని అవకాశాలుగా ఉపయోగించుకుని పరిస్థితుల్ని తేలిక పర్చడానికి ప్రయత్నిస్తాం. నేను చేసినది కూడా అదే.

జీవితం ఇద్దరికీ సంబంధించినది. మా ఇంట్లో నేనుకాక, అమ్మ, నాన్న, తాతయ్య, అక్కయ్య ఉన్నారు. ఇంత మంది నిన్ను మనస్ఫూర్తిగా స్వీకరించాలి. అప్పుడే ఇంట్లో ఆనందం, శాంతి ఉంటుంది.

మనం చదువుకున్నవాళ్ళం. చిన్న పిల్లలం మాత్రం కాదు. ఆవేశంతో నిర్ణయం తీసుకునే వేడి వయస్సులో లేం. మన జీవితం నీది, నాది, మనతో ముడిపెట్టుకుని ఉన్నవాళ్ళది కూడా. తొందరగా తీసుకున్న నిర్ణయంతో, ముందు ముందు మనశ్శాంతితో బతకలేమేమో అనిపించింది. అందుకని ఇన్ని రోజులు పట్టింది.

మనం బహుళ రాష్ట్రీయ సంస్థల్లో పనిచేస్తున్నాం. మనం మన కుటుంబ వ్యక్తులతో ఎలా ఉంటున్నాం అన్నది ముఖ్యం. నీతి, నిజాయితీలకి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు. నీ నీతి, నిజాయితీలు, నాకు బాగా నచ్చాయి.

మనకి ఈ రోజు ముఖ్యం. నిన్న-జీవితంలో అయిపోయిన ఓ రోజు మాత్రమే. అయిపోయిన దానిని తలుచుకుంటున్న కొద్దీ మాగ్నిఫై అవుతుంది. అందుకని తల్చుకోకూడదు.

సాయంత్రం ఇక్కడి నుంచే ఇంటికి వెళ్దాం. మా అమ్మ, నాన్నని, నానమ్మని, తాతయ్యని తీసుకొచ్చాను..."

లాస్యకి కళ్ళు పని చేస్తున్నా, బుర్ర, చెవులు పని చేయడం మానేసినట్లుగా అనిపించింది.

వెంటనే అక్కకి, ఇంటికి, ఫోన్ చేసి రోహిత్‌కి అభ్యంతరం లేదన్నాడని, సాయంత్రం వాళ్లింటికి వెళ్తున్నానని చెప్పి, తండ్రిని ఓసారి సాయంత్రం రోహిత్ ఇంటికి రమ్మనమని అంది, వచ్చేటప్పుడు తండ్రి తోడుగా ఉంటాడని. ఆడదానికి ఏ వయస్సులోనైనా ఎప్పుడూ ఓ తోడుండాలి. అన్నది నమ్మే స్త్రీ లాస్య. ఎందుకంటే ఒంటి స్త్రీకి జరిగిన భయంకరమైన అనుభవం. ఫీజు ఎక్కువగా చెల్లించానని ఆమెకెప్పుడూ గుర్తుంటుంది.

*తేజ వారపత్రిక, 25 జులై 2008*